నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 | వరంగల్, శనివారం 26 ఏప్రిల్ 2025 | HANUMAKONDA


■ జెండా పట్టి.. ఎడ్లబండ్లు కట్టి కదులుతున్న గులాబీ దండు
■ ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నేతలు
■ బైక్ ర్యాలీలు, సన్నాహక సమావేశాలతో విస్తృత ప్రచారం
■ కేసీఆర్ ఫ్లెక్సీలు, కటౌట్లతో కళకళలాడుతున్న రహదారులు

# పద పోదాం జనజాతరకు..



ఎల్కతుర్తిలో ముస్తాబవుతున్న రజతోత్సవ సభా ప్రాంగణం

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సమయం సమీపించడంతో గులాబీ దండు ఎల్కతుర్తికి దారి కదులుతున్నది. పాదయాత్రలు.. ఎడ్లబండ్లు, ప్రభబండ్ల ద్వారా జాతరవోలె కదలివస్తున్నది. ఇప్పటివరకు ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాల ద్వారా దిశానిర్దేశం చేసిన ఉమ్మడి జిల్లా నేతలందరూ ఇక క్షేత్రస్థాయికి వెళ్లి శ్రేణులతో కలిసి ప్రచారంలో జోరు పెంచారు. అలాగే ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆడబిడ్డలను ఆహ్వానిస్తూ, బైక్ ర్యాలీలు తీస్తూ జనంతో మమేకమవుతున్నారు. ఈ సందర్భంగా ఊరూవాడన ఎక్కడ చూసినా గులాబీ జోరు కనిపిస్తుండగా దారులన్నీ కేసీఆర్ ఫ్లెక్సీలు, కటౌట్లతో కళకళలాడుతున్నాయి.




హసన్‌పర్తి : దేవన్నపేటలో నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీ సందర్భంగా డప్పు వాయిస్తూ బీఆర్ఎస్ శ్రేణులను ఉత్సాహపరుస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




## బైక్ ర్యాలీ తీసి.. ఇంటింటా ప్రచారం చేసి..

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ నగరంలోని 11, 29వ డివిజన్లలోని భద్రకాళి టెంపుల్, రామన్నపేట, బెస్ట్ సంఘం, రఘునాథ్ కాలనీ, రంగంపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేశ్, డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ ఉన్నారు. – మట్టెవాడ, ఏప్రిల్ 25

## సభా ప్రాంగణానికి నేతల తాకిడి

రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి శుక్రవారం నేతలు తరలివచ్చి రజతోత్సవ సభా ప్రాంగణం, తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను చూశారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రేగా కాంతారావు, హరిప్రియ, కామారెడ్డి నుంచి జాజుల సురేందర్ తదితర నేతలు సభా స్థలికి రాగా, వారికి ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, నాగుర్ల వెంకటేశ్వర్లు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను వివరించడంతో పాటు వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాలను చూపించారు.




జనగామ రూరల్ : హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై పెంబర్తి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



## కేసీఆర్ సభకు రా చెల్లీ..

రజతోత్సవ సభకు రావాలని మహిళలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మానుకోట పట్టణంలోని 35వ వార్డులోని ఇంటింటికీ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి వెళ్లారు. ఇంటిల్లిపాదిని ఆప్యాయంగా పలుకరించడంతో పాటు మహిళలకు బొట్టు పెట్టి ప్రత్యేకంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు మహిళలకు ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. దీనికి నిరసనగా మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. – మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25



కొమ్మాల నర్సింహస్వామి ఆర్చి గేటు వద్ద ప్రభ ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ప్రారంభించి నడుపుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## రేపు ట్రాఫిక్ ఆంక్షలు

■ మూడు ప్రధాన రూట్లలో వాహనాల దారి మళ్లింపు
■ మధ్యాహ్నం 12 నుంచి అర్ధరాత్రి వరకు అమలు

సుబేదారి, ఏప్రిల్ 25 : ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధరాత్రి వరకు మూడు ప్రధాన రూట్లలో వాహనాల దారి మళ్లింపు ఉంటుందన్నారు. వాహనదారులు, ప్రయాణికులు ఆయా మార్గాల్లోనే వెళ్లి పోలీసులకు సహకరించాలని ఏసీపీ కోరారు.

**దారి మళ్లింపు ఇలా..**

■ కరీంనగర్ నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు హుజురాబాద్ నుంచి వయా పరకాల క్రాస్ రోడ్డు, ఉప్పల్, కమలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్‌రోడ్, ఓఆర్ఆర్ ద్వారా రావాలి. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో ప్రయాణించాలి.

■ సిద్దిపేట నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు జనగామ మీదుగా ప్రయాణించాలి. ఇదే మార్గంలో సిద్దిపేటకు వెళ్లాలి.

■ హుస్నాబాద్ నుంచి వచ్చే వాహనాలు వయా ముల్కనూరు, కొత్తకొండ, వేలేరు, మల్లికుదుర్ల, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల ద్వారా హనుమకొండకు చేరుకోవాలి. ఇదే మార్గంలో హుస్నాబాద్ వైపు వెళ్లాలి.

## రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

■ పైరవీలతో ఉద్యోగాలు రావని యువత గమనించాలి
■ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
■ కొమ్మాల ఆలయ ఆర్చి గేట్ వద్ద ప్రభ ట్రాక్టర్ ప్రారంభం

గీసుగొండ, ఏప్రిల్ 25 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, ఎవరికీ భయపడేది లేదని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆర్చి గేటు వద్ద బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి ప్రభ ట్రాక్టర్‌ను నడిపారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రజత్సోవ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని అన్నారు. దేవుడి దగ్గరకు ఎలా వెళ్తామో అలా ప్రజలు ఎండ్లబండ్లు, ప్రభలు, వాహనాలతో సభకు రాబోతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే టెక్స్‌టైల్ పార్కులోని కంపెనీలను ఇబ్బందుకు గురి చేస్తున్నాడని, అందులో ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను రోజూ తిప్పుతున్నాడని అన్నారు. కంపెనీల్లో పైరవీలతో ఉద్యోగాలు రావని యువత గమనించాలని అన్నారు. మీకు అర్హత ఉంటే కంపెనీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆనాడు కేసీఆర్ కృషి, తాను కష్టపడి రైతులను ఒప్పించి 1250 ఎకరాల భూములను సేకరిస్తే టెక్స్‌టైల్ పార్కు ఇక్కడి వచ్చిందని, యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎందుకు వస్త్ర పరిశ్రమలు పెట్టలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్దెబాబు, మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండల పార్టీ కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ సర్పంచులు బోడకుంట్ల ప్రకాశ్, పూంద్రు జైపాల్‌రెడ్డి, అంకతీ నాగేశ్వర్‌రావు, నాయకులు అంగోత్ మోతీలాల్, వీరాటి రవీందర్‌రెడ్డి, నాగయ్య, కుమారస్వామి, లెనిన్, శ్రీనివాస్, బాలరాజు, కోటి, ధనుంజయ్, ముంత రాజయ్య, లింగారెడ్డి, గుర్రం రఘు, వీరన్న, ప్రమోద్, రాజేందర్, సంతోష్, రాజేందర్, అఖిల్, నారాయణ, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



రాయపర్తి: సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ఉసిళ్ల దండులా తరలిరావాలి

■ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
■ దేవన్నపేటలో ఎడ్లబండ్లతో ర్యాలీ

రాయపర్తి/ హసన్‌పర్తి, ఏప్రిల్ 25: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవానికి ప్రజలు ఉసిల్ల దండులా తరలిరావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అలాగే హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో నిర్వహించిన ఎడ్ల బండ్ల ర్యాలీని ప్రారంభించారు. బండి నడుపుతూ, డప్పు వాయిస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, మేధావులు, తెలంగాణవాదులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. ఎల్కతుర్తి పేరు వింటేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లోని పాలకుల గుండెల్లో వణుకుపుడుతున్నదని, సభను ఎలాగైనా అడ్డుకోవాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలకు తెరలేపుతున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సభను విజయవంతం చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి 16 నెలల పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ మార్పిడిని కోరుకుంటున్నారని అన్నారు. వందల మంది రైతులు స్వచ్ఛందంగా బండ్లు కట్టుకొని సభకు బయలుదేరుతున్నారని చెప్పారు. సభలో ఎడ్ల బండ్లే హైలైట్ కావాలని, కేసీఆర్ మెచ్చుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ జెండాలు ఎగురవేయడంతోపాటు అమరవీరులకు నివాళులర్పించి ఎల్కతుర్తి సభకు సకాలంలో చేరుకోవాలని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### హుజూరాబాద్ నుంచి వేలాది మంది రాక

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలివస్తారు. కేసీఆర్ మాట వినాలని, చూడాలని ప్రజలు ఉత్సాహంగా ఉన్నారరు. రైతులు, మహిళలు, వృద్ధులు, యువకుల పక్షాన కేసీఆర్ గళం విప్పుతారు. తెలంగాణలోని ప్రతి గ్రామం నుంచి కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలి. కనీవినీ ఎరుగని రీతిలో ఈ బహిరంగ సభ విజయవంతం అవుతుంది.

– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్

## కేసీఆర్ వల్లే తెలంగాణ సాకారం

■ మాజీ మంత్రులు గంగుల, నిరంజన్‌రెడ్డి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ వేడుక రాజకీయ పార్టీది కాదని, రాష్ట్ర ప్రజలందరి పండుగ అని అభివర్ణించారు. శుక్రవారం వారు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. తొలుత వాహనాల పార్కింగ్ స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ కావాలనే బలమైన కాంక్ష ప్రజల్లో ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన నాయకుడు కేసీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశం మొత్తం కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని ఎల్కతుర్తి వైపు చూస్తున్నదన్నారు. పదేండ్లు కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే, 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి నెట్టిందన్నారు. ఇంత త్వరగా అభాసుపాలైన ఏకైక ప్రభుత్వం రేవంత్‌రెడ్డిది అని, మరో 25 ఏళ్ల వరకు కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. ఉమ్మడి కరీంనగర్ నుంచి లక్షలాదిగా ప్రజలు పలు వాహనాల్లో వస్తారని, పాదయాత్రగా వచ్చే వాళ్లు వేరే ఉన్నారన్నారు. భారీ ఎత్తున సభ విజయవంతం అవుతుందని గంగుల ఆశాభావం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు పేర్యాల రవీందర్‌రావు తదితరులున్నారు.



## దేశ చరిత్రలో అద్భుత ఘట్టం : పల్లా

ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. దేశ చరిత్రలోనే ఈ సభ అద్భుతమైన ఘట్టంగా నిలిచిపోతుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అధికారంలోకి రావడానికి ఈ సభ నాంది పలుకుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పల్లా కోరారు.

– ఎల్కతుర్తి, ఏప్రిల్ 25



## ముస్తాబవుతున్న తెలంగాణ తల్లి విగ్రహం

బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ఊరూరా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలు, పార్టీ జెండా గద్దెలు ముస్తాబవుతున్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి శుక్రవారం రంగులు వేసి తీర్చిదిద్దారు.

– దేవరుప్పుల, ఏప్రిల్ 25

## తెలంగాణ ప్రజల పండుగ




ములుగు, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ)/ములుగు రూరల్/: బీఆర్ఎస్ రజతోత్సవ సభ యావత్ తెలంగాణ ప్రజలకు పండుగ వంటిదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె ములుగు గట్టమ్మ ఆలయం వద్ద వెంకటాపూర్ నుంచి ఎల్కతుర్తికి పాదయాత్రగా బయల్దేరిన కార్యకర్తలకు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ రోజుకు 25 నుంచి 30 కిలోమీటర్లు ఎండాకాలంలో పాదయాత్ర చేయడం పార్టీపై వారికి ఉన్న అభిమానానికి నిదర్శనమనారు. వారి పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా జయప్రదం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. జీపీగా ఉన్న ములుగు జిల్లాకేంద్రంగా ఏర్పడి అభివృద్ధి చెందడం కేసీఆర్ ఘనతేనని తెలిపారు.



మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రజతోత్సవ సభ నిర్వహణకు మారుపెల్లి సాలమ్మ, బత్తిని ఎల్లమ్మ ఒక్కొక్కరు రూ.1000 చొప్పున విరాళం అందజేశారు. – ఖానాపురం, ఏప్రిల్ 25